

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

మెడికల్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలి

» వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రజలకు కంటి సమస్యలను స్క్రీనింగ్ చేయడానికి శంకర్ నేత్రాలయం హైదరాబాద్ వారు ముందుకొచ్చారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ నుంచి జూమ్ సమావేశంలో అధికారులతో మాట్లాడారు. అన్ని మండలాల్లో ఎంపీడీవోలు, మెడికల్ అధికారులు కలిసి క్యాంపు నిర్వహణకు చర్యలు చేపట్టాలని సూచించారు. క్యాంపు నిర్వహణకు లోకేషన్ గుర్తించడం, కంటి సమస్యలతో బాధపడుతున్న వారిని క్యాంపుకు తీసుకురావడం, అక్కడ కనీస సౌకర్యాలు ఏర్పాటుపై పలు సూచనలు చేశారు. పీహెచ్‌సీలలో మరమ్మతు పనులు పూర్తి అయ్యాయా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ లబ్ధిదారులకు ఉపాధి హామీ పథకం క్రింద 90 రోజులు పని దినాలు కల్పించాలన్నారు. ఎస్‌బీఎం ద్వారా ఒక మరుగుదొడ్డి మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, డీఆర్‌డీవో శ్రీనివాస్, డీఎంహెచ్‌ఓ పవిత్ర, ఎంపీడీవోలు, ఏపీఓలు, ఏపీఎంలు, మెడికల్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

సిటిజన్ సర్వేలో అందరూ పాల్గొనాలి

రాష్ట్ర భవిష్యత్ రూపకల్పనకై ఉద్దేశించిన తెలంగాణ రైజింగ్ -2047 సిటిజన్ సర్వేకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. ప్రభుత్వం గత వారం ప్రారంభించిన ఈ సర్వే ఈ నెల 25వ తేదీతో ముగుస్తుందన్నారు. ఈ సర్వే రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉన్నందున తెలంగాణ.జీవోవీ/తెలంగాణరైసింగ్ వెబ్‌సైట్‌ను సందర్శించి ప్రతీ ఒక్కరూ తమ అమూల్యమైన సలహాలు, సూచనలు అందించాలని సూచించారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి



ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న డీపీవో జయసుధ

పూడూరు, అక్టోబర్ 22(ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని డీపీవో జయసుధ కోరారు. మండలంలోని చెన్‌గోముల్‌లో బుధవారం ఆమె ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఎన్ని ఇళ్లు పూర్తయ్యాయి? నిర్మాణాలు ప్రారంభించని వారు ఎవరు? అనే విషయాలపై ఆరా తీశారు. లబ్ధిదారులు వెంటనే పనులు చేపట్టాలని సూచించారు.

డీసీసీ!

బరిలో 24 మంది నేతలు


కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవికి అభ్యర్థుల ఎంపిక తుది దశకు చేరుకుంది. జిల్లాలోని మూడు నియోజకవర్గాల నుంచి డీసీసీ పదవికి 24 మంది దరఖాస్తు చేసుకున్నారు. పోటీ పడుతున్న అభ్యర్థులను వివిధ ప్రాధాన్యతా అంశాల ఆధారంగా వడబోసి షార్ట్‌లిస్ట్ చేసినట్లు తెలుస్తోంది. ఈ జాబితాల్లో ఒక్కో సామాజిక వర్గం నుంచి ఇద్దరు చొప్పున ఆరుగురి అభ్యర్థులతో జాబితా రూపొందించినట్లు సమాచారం. 25వ తేదీన ఢిల్లీలో జరగనున్న కీలక భేటీలో నూతన అధ్యక్షుడు ఎవరనేది తేలనుంది. కొత్త సారథిగా ఎవరిని ప్రకటిస్తారోనని పార్టీ శ్రేణులు, కింది స్థాయి నాయకులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

సామాజిక వర్గాల వారీగా షార్ట్‌లిస్ట్

25వ తేదీన ఢిల్లీలో అధిష్ఠానం కీలక భేటీ

పీసీసీ చీఫ్, సీఎం, స్పీకర్‌తో చర్చ తర్వాతే స్పష్టత

ఉత్కంఠగా ఎదురుచూస్తున్న పార్టీ శ్రేణులు



వికారాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 2014 నుంచి 2023 వరకు పార్టీ అధికారంలో లేకపోవడంతో డీసీసీ అధ్యక్ష పదవికి అంతగా పోటీ లేదు, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడంతో డీసీసీ అధ్యక్ష పదవికి చేపట్టేందుకు పలువురు ఆసక్తి కనబరుస్తున్నారు. ఐదేళ్లుగా కాంగ్రెస్‌లో కొనసాగుతూ పార్టీకి విధేయులుగా ఉన్న వారు డీసీసీ అధ్యక్ష పదవికి అర్హులని అధిష్ఠానం స్పష్టం చేయడంతో ఆశావహులందరూ దరఖాస్తు చేశారు. పార్టీకి విధేయులుగా ఉన్న వారికే డీసీసీ అధ్యక్ష పదవి కట్టబెట్టాలని అధిష్ఠానం స్పష్టం చేసిన నేపథ్యంలో ఆశావహుల్లో ఎవరికి దక్కనుందనేది కాంగ్రెస్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

సామాజిక వర్గాల వారీగా..

వచ్చిన మొత్తం 24 దరఖాస్తులను ఏఐసీసీ పరిశీలకులు వడబోసి సామాజిక వర్గాల వారీగా షార్ట్‌లిస్ట్ చేసినట్లు తెలుస్తోంది. డీసీసీ అధ్యక్ష పదవికి ఎంపిక చేసేందుకు అధిష్ఠానం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా అభ్యర్థులను పరిగణనలోకి తీసుకున్నట్లు సమాచారం. ప్రజా ప్రతినిధులుగా కొనసాగుతున్న వారి కుటుంబ సభ్యులకు, బంధువులకు పదవి అవకాశం లేనట్లేనని తెలుస్తోంది. పార్టీకి విధేయులుగా ఉండి సుదీర్ఘ కాలంగా సేవలందిస్తూ... రానున్న రోజుల్లో పార్టీని ముందుండి నడిపించే సత్తా ఉన్న వారినే ఎంపిక చేయనున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే,

మిగతా 8వ పేజీలో...

డీసీసీ అధ్యక్షుడి ఎంపికపై 25వ తేదీన ఢిల్లీలో కీలక భేటీ జరగనుంది. పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీనటరాజన్‌తో జరిగే సమావేశంలో ఏఐసీసీ పరిశీలకుడు సంజయ్ సింగ్ ఠాకూర్ డీసీసీ అధ్యక్ష పదవి కోసం జిల్లాలో ఎంత మంది దరఖాస్తు చేసుకున్నారు, ఆశావహుల్లో ఎవరికి ఇస్తే

25న కీలక భేటీ..

పార్టీని బలోపేతం చేసేందుకు అవకాశం ఉంటుందని ప్రజా ప్రతినిధులు, కార్యకర్తల నుంచి సేకరించిన అభిప్రాయాలు, సామాజిక వర్గాల వారీగా రూపొందించిన జాబితాపై నివేదిక అందజేయనున్నారు. ఈ సందర్భంగా తమ పరిశీలనలో గుర్తించిన అంశాలను పరిశీలకుడు వివరించనున్నట్లు తెలిసింది. ఆ తర్వాత ఆ నివేదిక ఆధారంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, డీసీసీ అధ్యక్షుల ఎంపిక ప్రక్రియ జాతీయ కోఆర్డినేటర్ చల్లా వంశీచంద్‌రెడ్డి చర్చించి వికారాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఎవరనేది ఖరారు చేయనున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే, డీసీసీ అధ్యక్షుల ఎంపికలో పార్టీ నిఘా విభాగం అందించే నివేదిక అత్యంత కీలకంగా మారనున్నట్లు సమాచారం. రాష్ట్ర స్థాయిలో, ఉమ్మడి జిల్లా పరిధిలో సామాజిక న్యాయం జరిగే విధంగా డీసీసీ అధ్యక్షులను ఎంపిక చేయనున్నట్లు తెలుస్తోంది.



స్వామివారికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న నిర్వాహకులు

కీసరగుట్టలో కార్తీక పూజలు షురూ

కీసర, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): కీసరగుట్టలో బుధవారం కార్తీక మాస పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. నెలరోజుల పాటు జరిగే మాసోత్సవంలో భాగంగా ఆలయ చైర్మన్ తటాకం నారాయణ శర్మ ఆధ్వర్యంలో తెల్లవారుజామున గర్భాలయంలోని మూలవిరాట్‌కు శ్రీమహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, క్షీరాభిషేకంతో పూజలు ప్రారంభించారు. ఆనంతరం సాయంకాలం ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆకాశదీపోత్సవం కార్యక్రమం నిర్వహించారు. మొదటి రోజు భక్తులు అధిక సంఖ్యల్లో హాజరై భక్తి, శ్రద్ధలతో స్వామివారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫౌండర్ సభ్యులు, ట్రస్ట్ బోర్డు సభ్యులు, ఈవో సుధాకర్‌రెడ్డి, ప్రధాన అర్చకుడు బలరాంశర్మ, అర్చకులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో తెలంగాణ తల్లి విగ్రహం

ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

వికారాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ కలెక్టరేట్ కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం కలెక్టరేట్ వద్ద ప్రధాన ద్వారా వద్ద విగ్రహ ఏర్పాటుకు అవసరమైన పనులను చేపట్టారు. త్వరలోనే విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టరేట్ అధికారులు పేర్కొన్నారు.



మద్యం దుకాణాల దరఖాస్తులకు

నేడే చివరి తేదీ



'వికారాబాద్'లో ఇప్పటివరకు 1,757 దరఖాస్తులు

ఆఖరి రోజుపైనే ఎక్సైజ్ అధికారుల ఆశలు

వికారాబాద్/మేడ్చల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునేందుకు గురువారంతో గడువు ముగియనుంది. 18వ తేదీతో గడువు ముగిసినా మద్యం వ్యాపారుల విజ్ఞప్తితో 23వ తేదీ వరకు పొడిగించిన విషయం తెలిసిందే. శనివారం వరకు జిల్లాలోని 59 మద్యం దుకాణాలకు 1,750 దరఖాస్తులు రాగా, బుధవారం మరో ఏడు దరఖాస్తులు దాఖలయ్యాయి. తాండూరు సర్కిల్ పరిధిలో నాలుగు, పరిగి సర్కిల్ పరిధిలో రెండు, మోమిన్‌పేట్ సర్కిల్ పరిధిలో ఒక దరఖాస్తు వచ్చింది. అయితే ఆఖరు రోజున ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు రావచ్చని ఎక్సైజ్ అధికారులు ఆశాభావంతో ఉన్నారు. రెండేళ్ల కిందట వచ్చిన మేరకైనా ఈసారి దరఖాస్తులు దాఖలయ్యేలా అధికారులు తమ ప్రయత్నాలను మరింత ముమ్మరం చేశారు. మద్యం వ్యాపారులు, ఔత్సాహికులను ప్రోత్సహించేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఆఖరు రోజు 500 వరకు దరఖాస్తులు రావచ్చన్న భారీ ఆశలో అధికారులు ఉన్నారు.

మేడ్చల్ జిల్లాలో 5,548 దరఖాస్తులు

మేడ్చల్ ఎక్సైజ్ డివిజన్‌లో 118 మద్యం దుకాణాలకు ఇప్పటి వరకు 5,548 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. అలాగే బుధవారం 14 దరఖాస్తులు వచ్చాయి. అదేవిధంగా మల్కాజిగిరి ఎక్సైజ్ డివిజన్‌లో 88 మద్యం దుకాణాలుండగా ఇప్పటి వరకు 4,800 దరఖాస్తులు వచ్చాయి. ఇక్కడ కూడా బుధవారం 18 దరఖాస్తులు వచ్చాయి. నేడు టెండర్లకు చివరి తేదీ కావడంతో దరఖాస్తులు పెరిగే అవకాశం ఉందని ఎక్సైజ్ అధికారులు భావిస్తున్నారు. 27వ తేదీన మద్యం దుకాణాలకు డ్రా తీయనున్నారు.

కనికరంలేని కొడుకులు

ఆస్తి కోసం తండ్రిని హతమార్చిన తనయుడు

మరో చోట తల్లిని ఇంటి నుంచి గెంటేసిన ప్రబుద్ధుడు



కని, పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రుల పట్ల బాధ్యతగా వ్యవహరించాల్సిన పిల్లలు కర్కశంగా ప్రవరిస్తున్నారు. మానవత్వం మరిచి ఆస్తి కోసం ప్రాణాలు తీసేస్తున్నారు. వృద్ధాప్యంలో ఏమీ చేయలేక అమ్మానాన్నలు సైతం కన్నవారి చేతిలో చిత్రహింసలు అనుభవిస్తున్నారు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలంలో పూటుగా మద్యం తాగిన కొడుకు ఆస్తి తగాదాలతో తండ్రిపై పెద్ద బండరాయి వేసి హతమార్చాడు. వికారాబాద్ జిల్లా ధారూర్ మండలంలో తల్లి పేరున ఉన్న ఆస్తిని బలవంతంగా లాక్కొని ఆమె కనీస అవసరాలు కూడా పట్టించుకోకుండా ఇంటి నుంచి బయటకు గెంటేశాడో ప్రబుద్ధుడు. ఆకలివేస్తే అన్నం కూడా పెట్టడం లేదంటూ ఆ మాతృమూర్తి రోదిస్తూ చెప్పిన తీరు అక్కడున్నవారందరినీ కంటతడి పెట్టించింది.

7



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

రేపు తాండూరుకు మంత్రి శ్రీహరి

తాండూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రేపు (24న, శుక్రవారం) ఉదయం 11గంటలకు తాండూరు పట్టణంలోని బైపాస్ రోడ్డు సమీపంలో ముదిరాజ్ భవన్ శంకుస్థాపనకు రాష్ట్ర పశుసంవర్థక, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్ హాజరవుతున్నట్లు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తెలిపారు. అనంతరం మధ్యాహ్నం కోట్‌పల్లి ప్రాజెక్టులో చేప పిల్లలను విడుదల చేస్తారని ఆయన తెలిపారు. కార్యక్రమానికి కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.



రైతు సమస్యలపై నిర్లక్ష్యం తగదు

7

జిల్లా రైతు సమాఖ్య సమావేశంలో రైతుల ఆవేదన

రుణమాఫీ చేయాలని డిమాండ్

కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బంది ఉండొద్దు

» జిల్లాలో 135 కేంద్రాల ఏర్పాటు

» అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



సమావేశంలో మాట్లాడుతున్న లింగ్యానాయక్

వికారాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని సదుపాయాలు కల్పించాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం వానాకాలం ధాన్యం కొనుగోళ్లపై సన్నాహక ,శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రతీ కేంద్రంలో కేంద్రం పేరు మద్దతు ధర టోల్ ఫ్రీ నంబర్‌తో కూడిన ఫ్లెక్సీని ఏర్పాటు చేయాలన్నారు. సన్న, దొడ్డు ధాన్యం వేర్వేరుగా కౌంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,389, సాధారణ రకానికి 2,369 చొప్పున మద్దతు ధరను నిర్ధారించినట్లు తెలిపారు. అలాగే సన్నాలకు క్వింటాలుకు రూ.500 చొప్పున అదనంగా చెల్లిస్తామన్నారు. తూనిక యంత్రాలతో పాటు ధాన్యం శుభ్రపరిచే, తేమ శాతం కొలిచే యంత్రాలను, టార్పిలిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 135 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయునట్లు తెలిపారు. అలాగే 1.15లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించేందుకు అంచనా వేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతీ నియోజకవర్గానికి ప్రత్యేక అధికారులను నియమించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పౌర సరఫరాల జిల్లా అధికారి సుదర్శన్, జిల్లా మేనేజర్ మోహన్‌కృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి రాజారత్నం, జిల్లా సహకార అధికారి నాగార్జున, డీసీఎంఎస్ అధికారి శ్యాంసుందర్, వ్యవసాయ, ఐకేజీ, పీఏసీఎస్, డీసీఎంఎస్ అధికారులు పాల్గొన్నారు.

బకాయిలు రూ.13 కోట్లు



విద్యుత్‌శాఖలో పెండింగ్ బిల్లులు



ప్రభుత్వ ఆఫీసుల్లో రూ.కోటి మేరకు డ్యూ

సబ్ ఇంజనీర్లు లేక సిబ్బందిపై పనిభారం

ఏడు నెలలుగా బడ్జెట్ కేటాయింపులు నిల్

ఒక్క తాండూరు డివిజన్‌లోనే రూ.9.63 కోట్లు

తాండూరు, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో విద్యుత్ బకాయిలు పేరుకుపోతున్నాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం రూ.13కోట్ల బకాయిలు ఉండగా అందులో ఒక తాండూరు డివిజన్‌లోనే రూ.9.63కోట్లు ఉండటం గమనార్హం. అలాగే తాండూరు పట్టణంలో రూ.కోటి, పరిగిలో రూ.1.5కోట్లు, కొడంగల్‌లో రూ.67లక్షలు, వికారాబాద్‌లో రూ.2కోట్ల చొప్పున పెండింగ్ ఉన్నట్లు ఆ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో బకాయిల వసూళ్లపై విద్యుత్ శాఖ దృష్టి పెట్టింది. కాగా, జిల్లాలో 2,50,177 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. అందులో గృహజ్యోతి, ఎస్సీ, ఎస్టీ, నాయీ బ్రాహ్మణులకు ఉచిత విద్యుత్ అందించే కనెక్షన్లు 1,51,575 సర్వీసులున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి సుమారు రూ.కోటి వరకు బకాయి ఉండగా అందులో

మిగతా 8వ పేజీలో...

ఏడు నెలలుగా నో బడ్జెట్

జిల్లాలోని సీఎం నియోజకవర్గమైన కొడంగల్‌తో పాటు తాండూరు, పరిగి నియోజకవర్గాలకు మూడు నెలలకు ఒకసారి కేటాయించే నిధులు నయా పైసా విడుదల చేయడం లేదు. ఒక్కోక్క నియోజకవర్గానికి రూ. 30లక్షల చొప్పున నిధులు కేటాయించాలి. ప్రజాప్రతినిధులు ఎవరైనా అత్యవసరమైన స్తంభాలు వేయాలని, ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేయాలని కోరితే బడ్జెట్ లేక అధికారులు సమాధానం చెప్పలేక పోతున్నారు. బకాయిల కారణంగా విద్యుత్ శాఖలో పని చేస్తున్న కాంట్రాక్టర్లు సైతం పని చేసేందుకు వెనుకడుగు వేస్తున్నారు. స్పీకర్ ప్రసాద్ కుమార్ ఇటీవల కలెక్టరేట్‌లో విద్యుత్ అధికారులు, ఎమ్మెల్యేలతో సమీక్షించారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కూడా తాండూరు క్యాంప్ కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో సమీక్షించినప్పటికీ బడ్జెట్ లేని కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పనులు ముందుకు సాగడం లేదని స్పీకర్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు.

హోంగార్డుల సేవలు అభినందనీయం

వికారాబాద్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ హోంగార్డు అధికారి మహేశ్ సేవలు అమోఘమని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలో మహేశ్‌ను ఎస్పీ సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహేశ్ సుదీర్ఘకాలం క్రమ శిక్షణతో విధులు నిర్వహించి పోలీస్ శాఖకు అందించిన సేవలు మరువలేవనివన్నారు. ఉద్యోగ విరమణ తరువాత శేష జీవితాన్ని ఆరోగ్యంగా, ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాములునాయక్, ఆర్ఐ డేవిడ్, జిల్లా హోంగార్డ్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సుధాకర్, చాంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.


మహేశ్‌ను సన్మానిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి


తిమ్మాయిపల్లి రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి

భూసేకరణకు సహకరించాలి

● ఫ్యూచర్‌సిటీలో భూములు కోల్పోతున్న ప్రతీ రైతుకు పరిహారం

● కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి

కందుకూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించతలపెట్టిన ఫ్యూచర్‌సిటీ కోసం భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం తగిన న్యాయం చేస్తుందని కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం కందుకూరు ఆర్డీవో కార్యాలయంలో టీజీఐఐసీ అధికారులు, మండల పరిధిలోని తిమ్మాయిపల్లి గ్రామ రైతులతో భూనష్ట పరిహారంపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కందుకూరు మండలంలోని తిమ్మాయిపల్లి గ్రామ రెవెన్యూలోని సర్వే నంబర్ 9లోని ప్రభుత్వ, అసైన్డ్ భూములను ఫ్యూచర్‌సిటీ కోసం భూసేకరణ చేపడుతుందని, ఇందులో భూములు కోల్పోతున్న ప్రతీ రైతుకు తగిన పరిహారం అందజేసి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఎకరాకు రూ. 51,51,906 చెల్లించడంతో పాటు 121 గజాల ఇంటి స్థలం కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. భూములు కోల్పోతున్న రైతులు భూసర్వేకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కందుకూరు తహసీల్దార్ గోపాల్, టీజీఐఐసీ అధికారులు ప్రసాద్, అజీజా సుల్తానా, రైతులు పాల్గొన్నారు.

అవినీతిని వెలికితీసేందుకే సోషల్ ఆడిట్

మోమిన్‌పేట్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల్లో అవినీతి జరగకుండా చూసేందుకే సామాజిక తనిఖీ నిర్వహించినట్లు మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వై.మహేందర్‌రెడ్డి, డీఆర్‌డీవో ఏపీడీ సరళ అన్నారు. బుధవారం మోమిన్‌పేట్‌లోని మండల పరిషత్‌లో సామాజిక తనిఖీ సభను నిర్వహించారు. ఏప్రిల్ 2024 నుంచి మార్చి 2025 వరకు జరిగిన 527 పనుల్లో కూలీలకు చెల్లించిన రూ.9.8కోట్లకు సంబంధించిన లెక్కలపై విచారణ చేశారు. వారం రోజులుగా ఉపాధి హామీ సిబ్బంది గ్రామాల్లో చేసినా సామాజిక తనిఖీ వివరాలను వెల్లడించారు. వివిధ పొరపాట్లకు క్షేత్రస్థాయి సిబ్బందికి రూ.11వేల జరిమానా, పనుల్లో జరిగిన అవకతవకలకు రూ.32,567 రికవరీకి ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు సదానందం, యాదగిరి, రాములు, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర, సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.


వివరాలను వెల్లడిస్తున్న అధికారులు

పాఠశాలలో పాము కలకలం

యాలాల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): యాలాలలోని జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో పాము కలకలం రేపింది. బుధవారం ఉదయం విద్యార్థినులకు బాత్రూంలో పాము కనిపించింది. దీంతో వారు టీచర్లకు తెలిపారు. ఉపాధ్యాయులు గ్రామంలో కొందరిని పిలిపించి పామును చంపించారు.

ఇందిరమ్మ ఇళ్లు ఆత్మగౌరవానికి ప్రతీక

● కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

తలకొండపల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పేదల ఆత్మగౌరవానికి ప్రతీక ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం అని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. తలకొండపల్లి మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. మండల కేంద్రానికి చెందిన పోతుగంటి మాదవి, పోతుగంటి సిద్దమ్మ, నర్సమ్మలకు ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క ఇల్లు కూడా ఇవ్వకుండా పేదలకు అన్యాయం చేశారని ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల చెల్లింపులో జాప్యం లేకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మిట్టపల్లి అంజయ్య, డిగ్రీ కృష్ణ, రవీందర్ యాదవ్, కృష్ణ, గణేశ్, పాండు, రమేశ్, జనార్దన్ రెడ్డి, శేఖర్, నరేశ్ ఉన్నారు.

రైతు సేవా కేంద్రం ప్రారంభం

పోచారం గిరీధర్ రెడ్డి ఆధ్వర్యంలో తలకొండపల్లిలో ఏర్పాటు చేసిన రైతు సేవా కేంద్రాన్ని ఎమ్మెల్యే నారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో బాలాజీ సింగ్, అంజయ్య, మోహన్ రెడ్డి, యాదగిరి, పాండు, మల్లేశ్, గణేశ్, రవీందర్,కృష్ణ, రమేశ్, కుమార్, రాజురెడ్డి ఉన్నారు.


ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు మంజూరుపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

జెన్నాయిగూడ రైతులకు న్యాయం చేయాలి

మహేశ్వరం/కందుకూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తుక్కుగూడ మున్సిపాలిటీలోని జెన్నాయిగూడ గ్రామ రైతులకు న్యాయం జరిగే వరకు ఉద్యమాలను ఆపేదిలేదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాంచందర్ అన్నారు. జెన్నాయిగూడ రైతులకు తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం కందుకూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2004లో అప్పటి ప్రభుత్వం వివిధ రకాల పరిశ్రమల కోసం టీఎస్ఐఐసీకి జెన్నాయిగూడ రైతుల భూములను సేకరించిందని, భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయడంలో అప్పటి, ఇప్పటి ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. ఈకార్యక్రమంలో సీపీఎం నాయకులు యాదయ్య, రవికుమార్, శేఖర్‌తోపాటు రైతులు పాల్గొన్నారు.


ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు


మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

బీసీల సాధికారత రాజ్యాధికారంతోనే సాధ్యం

షాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బీసీల సాధికారత రాజ్యాధికారంతోనే సాధ్యమని బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు అన్నారు. బీసీ రిజర్వేషన్ సాధన సమితి షాబాద్‌లో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష బుధవారంతో 11వ రోజుకు చేరింది. ఈ దీక్షలో షాబాద్ మండల మున్నూరు కాపు నాయకులు పాల్గొన్నారు. బీసీ సంఘం నాయకులు చేస్తున్న దీక్షకు మద్దతుగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కన్వీనర్ కుంట సిద్దిరాములు, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, చేవెళ్ల స్వామి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీల రిజర్వేషన్లను కొందరు కుట్రతో అడ్డుకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు, తదితరులు ఉన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

కడ్తాల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కానుగుబావి తండాలో నూతనంగా నిర్మించిన శ్రీ తుల్జా భవాని మాత ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు నిర్వహించే వేడుకలకు ఆలయాన్ని పచ్చటి తోరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో కానుగుబావి తండాలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. విగ్రహ ప్రతిష్ఠ వేడుకల్లో భాగంగా మొదటి రోజు గణపతిపూజ, స్వస్తి హవాచనం, అఖండ దీపారాధన, అంకురార్పణ, గోపూజ, అగ్నిప్రతిష్ఠ, హోమాలు నిర్వహించారు. తండాలో గిరిజనులు ఊరేగింపు నిర్వహించారు. ఈకార్యక్రమంలో బీక్యానాయక్, పాండునాయక్, బీచ్యానాయక్, నర్సింగ్, లక్ష్మణ్, నరేశ్, బాలు, రాజు, నాగార్జున, దేవుల, జాన్య, రతన్ పాల్గొన్నారు.


విగ్రహ ప్రతిష్ఠ పూజల్లో భక్తులు

భూ భారతి దరఖాస్తులను పరిష్కరించాలి

● వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

దుద్యాల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): భూ భారతిలో స్వీకరించిన దరఖాస్తుల పరిశీలన చేసి త్వరగా పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులను సూచించారు. బుధవారం హస్నాబాద్‌లో భూ భారతిలో స్వీకరించిన 27 సాదాబైనామా దరఖాస్తులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా భూ భారతి దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని తహసీల్దార్ కిషన్‌నాయక్‌కు సూచించారు. అనంతరం తహసీల్దార్, సిబ్బందితో కలిసి గ్రామానికి చెందిన రైతుల భూ సమస్యలను పరిశీలించారు. భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ నవీన్‌కుమార్, గోపాల్ ఉన్నారు.

ఇంటి స్థల సమస్యను పరిష్కరిస్తాం

● రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కిన్నెర కళాకారుడు పద్మశ్రీ అవార్డు గ్రహీత దర్శనం మొగులయ్యకు ప్రభుత్వం కేటాయించిన స్థలం విషయంలో తలెత్తిన విషయంలో సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. తనకు ప్రభుత్వం కేటయించిన స్థలంలో కొందరు ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ మొగులయ్య ఇటీవల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిశారు. దీంతో ఆయన కలెక్టర్ నారాయణరెడ్డితో ఫోన్లో మాట్లాడారు. ఈ మేరకు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డితో కలిసి మొగులయ్య బుధవారం కొంగరకలాన్‌లోని కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిశారు. మొగులయ్యకు హయత్‌నగర్ కుంట్లూరు రోడ్డులో సర్వే నం.159లో కేటాయించిన ఇంటి స్థలం విషయంలో ప్రైవేట్ వ్యక్తులు కోర్టును ఆశ్రయించడంతో సమస్య ఎదురవుతున్నందున ప్రభుత్వ పరంగా తగు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు.


కలెక్టర్‌తో మొగులయ్య

పంటల వివరాలు నమోదు చేసుకోవాలి

తాండూరు రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): తాండూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధి బషీరాబాద్, యాలాల, పెద్దేముల్, తాండూరు మండలాల రైతులు తమ పంటలను ఆన్‌లైన్ నమోదు చేసుకోవాలని తాండూరు వ్యవసాయ శాఖ ఇన్‌చార్జి ఏడీఏ కొమరయ్య తెలిపారు. రైతులంతా తమ పంటలను వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద నమోదు చేసుకోవాలని కోరారు. పత్తి అమ్ముకునేందుకు యాలాలలో 3, పెద్దేముల్ మండలంలో 2 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. పత్తి రైతులు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా 'కపాస్ కిసాన్' యాప్‌ను మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ ప్రకారమే విక్రయాలు కొనసాగుతాయని అన్నారు.


ఏడీఏ కొమరయ్య

చట్ట విరుద్ధ పనులు చేయొద్దు

మాడ్గుల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఎవరైనా చట్ట విరుద్ధ కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని సీఐ వేణుగోపాల్ హెచ్చరించారు. ఎస్సైలు రాఘవేందర్, నాగరాజుతో కలిసి మాడ్గుల పరిధిలోని రౌడీ షీటర్లు, సస్పెక్ట్ సీటర్ల ఇళ్లను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వారి ప్రవర్తన తీరును పరిశీలించారు.

ఘనంగా చినజీయర్‌స్వామి తిరునక్షత్ర మహోత్సవం

● హాజరైన మైహోం గ్రూప్ అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు

● పలువురికి అవార్డుల అందజేత

శంషాబాద్ రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి జిల్లా ముచ్చింతల్ సమతామూర్తి స్ఫూర్తి కేంద్రంలో ప్రముఖ ఆధ్యాత్మిక గురువు శ్రీ త్రిదండి రామానుజ చినజీయర్‌స్వామి 69వ తిరునక్షత్ర (జన్మదినం) వేడుకలు బుధవారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఉదయం వెంకటేశ్వరస్వామి ఆలయంలో చినజీయర్‌స్వామి ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితుల ఆశీర్వాదం తీసుకున్నారు. చినజీయర్ స్వామి జన్మదినాన్ని పురస్కారించుకుని పలు సేవ కార్యక్రమాలు చేపట్టారు. స్వామిజీ తిరునక్షత్ర మహోత్సవంలో విశిష్ఠ సేవలు అందించిన ప్రముఖులకు అవార్డులు అందజేశారు. ఈ ఏడాది సత్యనారాయణచార్యులకు జీయర్ అవార్డు దక్కింది. అలాగే పెన్నా మధుసూదన్‌కు విద్వాన్‌మణి అవార్డు , డాక్టర్ సౌమ్యమిశ్రా ఐఏఎస్, సజ్జనార్‌లకు సేవ శిరోమణి అవార్డులు దక్కాయని నిర్వాహకులు తెలిపారు. స్వామిజీ తిరునక్షత్ర మహోత్సవానికి నగరం నలువైపుల నుంచి భారీగా తరలివచ్చారు. భక్తులకు చిన జీయర్‌స్వామి మంగళశాసనములు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మైహోం గ్రూప్ అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.


సత్యనారాయణచార్యులకు అవార్డును అందజేస్తున్న చినజీయర్‌స్వామి

శ్రీశైలం హైవేను విస్తరించాలి

ఆమనగల్లు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ - శ్రీశైలం జాతీయ రహదారి విస్తరణకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నట్లు నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి తెలిపారు. జాతీయ రహదారిని విస్తరించాలని కడ్తాల, ఆమనగల్లు మండలాల కాంగ్రెస్ నాయకులు బుధవారం ఎంపీ మల్లు రవిని ఆయన నివాసంలో కలిసి విన్నవించారు. ఈ మేరకు టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ ఎంపీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ తుక్కుగూడ నుంచి కందుకూర్, కడ్తాల్, ఆమనగల్లు, వెల్దండ, డిండి మీదుగా శ్రీశైలం వరకు జాతీయ రహదారిని ఆరు లేన్లుగా విస్తరించాలని ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డితో కలిసి కేంద్ర మంత్రి గడ్కరీకి విన్నవించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మధుసూదన్ రెడ్డి, మండ్లీ రాములు, అంజినాయక్ ఉన్నారు.


ఎంపీ మల్లు రవికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు


గురునాథ్‌రెడ్డిని కలిసిన వ్యాపారులు

మెడికల్ కాలేజీని తరలించొద్దు

● పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌కు వినతి

కొడంగల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కొడంగల్‌కు మంజూరైన మెడికల్ కళాశాల, ఇంటిగ్రేటెడ్ గురుకులాలను వేరేచోటకు తరలించొద్దని, కొడంగల్‌లో రోడ్డు విస్తరణలో ఇళ్లు, దుకాణాలను కోల్పోతున్న వారికి న్యాయ పరిహారం ఇవ్వాలని జేఏసీ నాయకులు, వ్యాపార సముదాయాల యజమానులు కోరారు. బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. స్పందించిన గురునాథ్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి విద్యాసంస్థలు కొడంగల్‌లోనే ఏర్పాటయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కొడంగల్ అభివృద్ధి, పరిరక్షణ జేఏసీ నాయకులు పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

పేదలకు ప్రభుత్వాలు అండగా నిలవాలి

» మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

మహేశ్వరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న పేదలకు ప్రభుత్వాలు అండగా ఉండాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. బుధవారం నగరంలోని ఆమె నివాసంలో మహేశ్వరం ప్రాంతానికి చెందిన పలువురికి మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉండి ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా అందించామన్నారు. ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఆంక్షలు విధిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే విజయమన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రయ్య, నవీన్, బాలయ్య, రమేష్ ఉన్నారు.

ఒబేదుల్లాను కలిసిన కాంగ్రెస్ నేతలు



ఒబెదుల్లా కొత్వాల్‌ను సన్మానిస్తున్న శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్ రెడ్డి

కడ్తాల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ ను బుధవారం టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కొత్వాల్ ను కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. మైనార్టీ కార్పొరేషన్ ద్వారా ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి మండలాలకు నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్లు అందజేయాలని కోరారు. ఒబేదుల్లా కొత్వాల్‌ను కలిసిన వారిలో మాజీ జెడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ తదితరులు ఉన్నారు.

ఆర్ఎస్ఎస్ పథ సంచాలన్

కోట్‌పల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కోట్‌పల్లి శాఖ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో ఆర్ఎస్ఎస్ శతజయంతి పథ సంచాలన్ కార్యక్రమం నిర్వహించారు. శ్రీ శంకర్ స్వామీజీ దామర్చడు(తెలంగాణ ప్రాంత సాధు పరిషత్ అధ్యక్షులు) హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ. ఆర్ఎస్ఎస్‌ను 1925లో స్థాపించారన్నారు. దేశ నిర్మాణంలో నిమగ్నమైన సంఘం, 2025 విజయదశమికి వందేళ్లు పూర్తిచేసుకుందని తెలిపారు.

చెక్ డ్యామ్‌లను పరిశీలించిన విద్యార్థులు



కుంటలు, చెక్ డ్యామ్‌లను పరిశీలించిన కంది వ్యవసాయ విద్యార్థులు

మోమిన్‌పేట్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతాల్లో భూమి కోతకు గురి కాకుండా ఉండేందుకు, నీటి నిల్వకు చెక్ డ్యామ్‌లను దోహదపడుతాయని కంది మండలం వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు అన్నారు. బుధవారం కళాశాల తృతీయ సంవత్సరం విద్యార్థులు ప్రాజెక్టు వర్క్‌లో భాగంగా గోవిందాపూర్‌లో కందకాలు, నీటి కుంటలు, వాటర్‌షెడ్, చెక్‌డ్యామ్‌లు, రాతి కట్టడాలను పరిశీలించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కిషన్, పాషా, ప్రసాద్, సాయిల్ అండ్ వాటర్ డిపార్ట్‌మెంట్ శ్రీనివాసులు, ఆర్.స్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

సాంకేతిక రంగంలో రాణించాలి



సాంకేతిక ఆవిష్కరణలను పరిశీలిస్తున్న ప్రొఫెసర్లు

మేడ్చల్ టౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాంకేతిక రంగంలో రాణిస్తేనే కొత్త ఆవిష్కరణలు వస్తాయని హైదరాబాద్ ట్రిపుల్ ఐటీ ప్రొఫెసర్ అనిల్‌కుమార్ అన్నారు. బుధవారం గుండ్లపోచంపల్లి పరిధి మైసమ్మగూడ సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో రాష్ట్రస్థాయి ఎక్స్‌పో-25 నిర్వహించారు. 439 జట్లు, 1,300 మంది విద్యార్థులు పాల్గొని వారు చేసిన సాంకేతిక ఆవిష్కరణలను ప్రదర్శించారు. దినదినాభి వృద్ధి చెందుతున్న సాంకేతిక రంగంలో పట్టు సాధించాలంటే కొత్త ఆవిష్కరణలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ క్లౌడ్ ఆర్కిటెక్ట్, ఏడబ్ల్యూఎస్ కమ్యూనిటీ బిల్డర్ అండ్ అంబాసిడర్ ఎం.నాగబాబు, కళాశాల కార్యదర్శి టీవీ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ సరోజారెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ అనురాగ్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతు సమస్యలపై నిర్లక్ష్యం తగదు


» జిల్లా రైతు సమాఖ్య సమావేశంలో ఆవేదన..

మేడ్చల్, అక్టోబర్ 22(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో రైతుల సమస్యలపై అధికారుల నిర్లక్ష్యం తగదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కలెక్టరేట్‌లోని జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో జిల్లా రైతు సమాఖ్య సమావేశాన్ని నిర్వహించారు. రైతుల సమస్యలపై చర్చించారు. యాసంగి సన్న వడ్లకు బోనస్ ఇవ్వలేదని, రుణమాఫీ పూర్తిస్థాయిలో కాలేదని, జిల్లాలో 49,725మంది రైతులు ఉండగా అందులో 30వేల మందికే రైతు భరోసా అందిందని, రెవెన్యూ సదస్సులు నామమాత్రంగా నిర్వహించారని అన్నారు. తరుగు పేరిట రైతులను మోసం చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పొలాల్లో విద్యుత్‌వైర్లు చేతికందే ఎత్తులో వేలాడుతున్నాయని వాపోయారు. అనంతరం పలు తీర్మానాలు చేశారు. సమావేశంలో జిల్లా రైతు సమాఖ్య నాయకులు సంజీవరెడ్డి, జగన్నాథం, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన రైతులు

ఆస్తి తగాదాలతో తండ్రిని హతమార్చిన కొడుకు



మేడ్చల్ టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆస్తి తగాదాల నేపథ్యంలో మద్యం మత్తులో కొడకు కన్న తండ్రిని హత మార్చాడు. ఈ ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా ములుగు మండలం అచ్చాయిపల్లి గ్రామానికి చెందిన నిజాముద్దీన్ (65)కు అతని కొడుకు షేక్ సాదక్‌తో కొద్ది రోజులుగా ఆస్తి విషయంలో తగువు కొనసాగుతోంది. ఈ క్రమంలో నిజాముద్దీన్, షేక్ సాదక్ అతని మిత్రుడు రాజుతో కలిసి ముగ్గురు మంగళవారం శామీర్‌పేట మండలం మురాహరిపల్లి సమీపంలోని ప్రజయ్ వాటర్ ప్లాంట్ వద్ద ముగ్గురు కలిసి మద్యం సేవించారు. ఆ సమయంలోనూ తండ్రీకొడుకుల మధ్య ఆస్తి విషయంలో తగువు పడ్డారు. మాటామాటా పెరగడంతో ఆగ్రహంతో సాదక్ అక్కడే ఉన్న బండరాయితో తండ్రి నిజాముద్దీన్ తలపై మోదీ అక్కడ నుంచి మిత్రుడు రాజుతో కలిసి పరారయ్యాడు.



నిజాముద్దీన్(ఫైల్)

బుధవారం ఉదయం నిజాముద్దీన్ మృతదేహాన్ని చూసిన స్థానికులు మేడ్చల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నగరంలోని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కాగా, హత్యకు పాల్పడ్డ షేక్ సాదక్ అతడి మిత్రుడు రాజును పోలీసులు అదుపులో తీసుకున్నట్టు సమాచారం. ఆస్తి విషయంలో మాటామాట పెరిగి హత్యకు దారి తీసినట్టు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించినట్టు సమాచారం. ఇదే కోణంలో పోలీసులు విచారణ చేపట్టి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

తల్లిని గెంటేసిన తనయుడు

» ఆస్తి లాక్కొని అన్నం కూడా పెట్టని ప్రబుద్ధుడు

» రోదిస్తూ అధికారులకు విన్నవించుకున్న వృద్ధురాలు

» న్యాయం చేయాలని ఆర్డీవోను వేడుకోలు



వికారాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కని పెంచిన కొడుకే కాలయాముడై తల్లిని వేధిస్తూ అన్నం పెట్టకుండా ఇంటి నుంచి తరిమేయడంతో ఓ తల్లి రోదిస్తోంది. ఈ ఘటన వికారాబాద్ ఆర్డీవో ఆఫీసు వద్ద చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ధారూరు మండలం నాగారానికి చెందిన గౌసియాబేగంకు ఇద్దరు కుమారులు, కూతురు. అయితే గౌసియా పెద్ద కుమారుడు మహమూద్ మియా తల్లి ఆస్తిని తన పేరిట రాసుకొని తమ్ముడికి ఏమీ ఇవ్వలేదు.



రోదిస్తున్న గౌసియాబేగం

దీంతో తనకేమీ ఇవ్వలేదని చిన్న కొడుకు తల్లిని తనింటికి రానివ్వడం లేదు. ఆస్తి రాసుకున్న పెద్ద కొడుకైనా చేరదీస్తాడను కుంటే అతడు చిత్రహింసలకు గురి చేస్తున్నాడని గౌసియా విలపించింది. తన వద్ద ఉన్న రూ.4లక్షల డబ్బు తీసుకొని, భూమి కూడా లాక్కున్నాడని, తన ఆస్తి తనకివ్వమంటే కొడుతున్నాడని, ఇంట్లోకి రానివ్వడం లేదని విలపిస్తూ తెలిసింది. అధికారులు ఈ విషయంలో తనకు న్యాయంచేయాలని, తన ఆస్తి అందరికీ సమానంగా ఇచ్చి పెద్ద కొడుకుపై చర్యలు తీసుకోవాలని కోరింది. వృద్ధురాలి బాధను గుర్తించిన ఆర్డీవో వాసుచంద్ర ఆమెకు భోజనం పెట్టించి సమస్యను ఆలకించారు.

ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి చేస్తాం

» ఎమ్మెల్యే కాలె యాదయ్య

షాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రభుత్వంలో ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల పరిధిలోని హైతాబాద్‌లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి, గుడిమాల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్‌లతో కలిసి రూ.కోటితో చేపట్టిన సీసీ రోడ్ల పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హైతాబాద్‌లో అంతర్గత రోడ్ల నిర్మాణానికి రూ.కోటి రూపాయలు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. చందన్‌వెళ్లి, హైతాబాద్, మాచన్‌పల్లి, సీతారాంపూర్ ప్రాంతాల్లో భారీ పరిశ్రమలు ఏర్పడడంతో ఇక్కడి ప్రాంత ప్రజలకు ఉపాధి లభిస్తుందన్నారు. షాబాద్ మండలాన్ని రెండు మండలాలుగా విభజిస్తే పరిపాలన సులభతరమై మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. అదేవిధంగా గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన చికెన్ సెంటర్‌ను ప్రారంభిచారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అన్వర్, మాజీ ఎంపీటీసీలు చెన్నయ్య, అశోక్, వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు జనార్దన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రవీందర్‌నాయక్, మహేందర్‌గౌడ్, ఖాజామియాపటేల్, శ్రీనివాస్ గౌడ్, సర్దార్‌నగర్ ఏఎంసీ డైరెక్టర్లు సంజీవరెడ్డి, నర్సింహులుగౌడ్, నాయకులు పీసరి సతీష్‌రెడ్డి, పీసరి వెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, సూర్యగౌడ్, కిషోర్‌నాయక్, శ్రీను, వేణు, శ్రీనివాస్, మహేష్, రాఘవేందర్, రమేష్ పాల్గొన్నారు.



హైతాబాద్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

రాజకీయాల్లో యువతకు ప్రాధాన్యం



వంశీచంద్ రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ఆమనగల్లు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో యువత ప్రాధాన్యం పెంచాలన్నదే రాహుల్ గాంధీ లక్ష్యమని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, డీసీసీ అధ్యక్షుల నియామక ప్రక్రియ ఏఐసీసీ ఇన్‌చార్జి చల్లా వంశీచంద్ రెడ్డి అన్నారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల కాంగ్రెస్ నాయకులు బుధవారం వంశీచంద్ రెడ్డిని హైద రాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. పలు విషయలపై ఆయనతో చర్చించారు. ఈ సందర్భంగా వంశీచంద్ రెడ్డి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా డీసీసీ అధ్యక్షుల ఎంపిక ఏఐసీసీ పారదర్శకంగా చేపడుతున్నట్లు తెలిపారు. క్షేత్ర స్థాయిలో నాయకులు, కార్యకర్తల అభిప్రాయం మేరకు అధ్యక్షుల నియామకం ఉంటుందని పేర్కొన్నారు. ఈ నెలాఖరు వరకు డీసీసీ అధ్యక్షుల నియామకం పూర్తవుతుందని వెల్లడించారు. ఓటు చోరీపై రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి ప్రజలంతా గళం విప్పాలని పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని దీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యక్రమాల అమలుపై ఆరా

» రాష్ట్ర వైద్యారోగ్య శాఖ డైరెక్టర్ రవీందర్ నాయక్



అధికారులతో మాట్లాడుతున్న రవీందర్‌నాయక్

మేడ్చల్, అక్టోబర్ 22(ఆంధ్రజ్యోతి ప్రతినిధి: రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ డైరెక్టర్ బి.రవీందర్ నాయక్ బుధవారం మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన డీఎంహెచ్‌వో ఉమాగౌరి, జిల్లా ప్రోగ్రాం అధికారులు, సెక్షన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో అమలవుతున్న టీబీ, ఎన్‌సీడీ, ఇమ్యూనైజేషన్, ఫ్యామిలీ ప్లానింగ్, ఆసుపత్రుల నిర్వహణ వంటి అన్ని ఆరోగ్య కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కార్యక్రమాలపై వివరణాత్మక సమీక్ష నిర్వహించి, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలపై సూచనలు చేశారు. సమావేశంలో ప్రోగ్రాం అధికారులు మల్లీశ్వరీ, చంద్రకళ, శ్రీదేవి, సత్యవతి, కౌశిక్, వినోద్, వసంత కుమారి, కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నిర్భయచట్టంపై అవగాహన



అవగాహన కల్పించిన షీ టీమ్ ప్రతినిధులు

దోమ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయినాపూర్ ఉన్నత పాఠశాలలో బుధవారం పరిగి సబ్ డివిజన్ షీ టీమ్ ఇన్‌చార్జి నర్సిములు ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళలపై జరుగుతున్న నేరాలు, నిర్భయ, పోక్సో యాక్ట్, డయల్ 100, షీ టీమ్181, సీసీ కెమెరాలు, బాల్య వివాహాల, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, కమ్యూనిటీ పోలీసింగ్, మానవ అక్రమ రవాణా, మద్యపాన నిషేధం, బ్యాంకింగ్ ఆన్‌లైన్ మోసాలు, గంజాయి నిర్మూలన తదితర నేరాలపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం బాబుచందు, టీచర్లు, షీ టీమ్ ప్రతినిధులు సావిత్రి, శోభ పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

కొడంగల్ రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటు టీకాలను రైతులు విధిగా వేయించాలని పశువైద్యులు పరమేశ్ అన్నారు. బుధవారం బోనమ్మతండాలో 210పశువులకు గాలికుంటు నివారణ టీకాలను వేశారు. వైద్యుడు మాట్లాడుతూ.. పశువులకు తీవ్ర జ్వరం, నీరసం, నోటి నుంచి సొంగ కారడం, నోరు కాలు గిట్టల మధ్య పుండ్లు వంటి లక్షణాలు ఉంటాయన్నారు. రైతులు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పక వేయించాలన్నారు. హస్నాబాద్ పశువైద్య కేంద్రం సిబ్బంది పల్లురాళ్ల తండాలో 92పశువులకు టీకాలను వేశారు. కొడంగల్, ఎరాన్‌పల్లి పశువైద్య సిబ్బంది కొండారెడ్డిపల్లిలో 146, ఉడిమేశ్వరంలో 80 పశువులకు టీకాలను వేశారు. కార్యక్రమంలో సిబ్బంది వెంకటయ్య, శేఖర్, సమీర్, విశ్వనాథ్, గోపాల మిత్రలు రాకేష్‌గౌడ్, శివకుమార్, వెంకటప్ప, రైతులు పాల్గొన్నారు.



ఎల్లమ్మతండాలో నిరాహార దీక్ష చేస్తున్న గిరిజన రైతులు

భూమిని అప్పగించాలని నిరాహార దీక్ష

మంచాల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): తమ భూములను తిరిగి అప్పగించాలని కోరుతూ మంచాల మండల పరిధిలోని ఎల్లమ్మతండాకు చెందిన గిరిజన రైతులు నిరాహార దీక్ష చేపట్టారు. అక్రమంగా తమనుంచి లాక్కుని తమకు అన్యాయం చేశారంటూ స్థానిక రైతులు మూడురోజులుగా నిరవధిక నిరాహార దీక్షలో కూర్చొన్నారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ బోడకొండ రెవెన్యూ సర్వే నం.91 నుంచి 195 వరకు గల భూములను తాతల కాలం నుంచి నమ్ముకుని జీవనం సాగిస్తున్నామని చెప్పారు. కాస్తు కాలంలోనూ తామే కొనసాగుతున్నామని పేర్కొన్నారు. తమ ప్రమేయం లేకుండా పట్టాదారులుగా కొనసాగుతున్న వారు ఈ భూములను విక్రయించారని చెప్పారు. తర్వాత రియల్ వ్యాపారులు ఈ భూముల చుట్టూ ఫెన్సింగ్ వేసి కబ్జా చేశారని ఆరోపించారు. ప్రభుత్వమే తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. ఆందోళనలో వస్రాం, శంకర్‌నాయక్, పాండు, బాలూనాయక్, మంగమ్మ, రఘునాయక్, బల్సేట్ నాయక్ పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల ఎత్తివేత హర్షనీయం



షాద్‌నగర్ అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా రవాణాశాఖ చెక్‌పోస్టులను ఎత్తివేయడంతో వాహనదారులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలంగాణ రాష్ట్ర లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సయ్యద్ సాధిక్ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. చెక్‌పోస్టుల వల్ల లారీలతోపాటు ఇతర ట్రాన్స్‌పోర్టు వాహనాల సమయం, డీజిల్, డబ్బులు ఆదా అవుతాయని పేర్కొన్నారు. ఈ విషయమై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని రాష్ట్ర అసోసియేషన్ కలిసి వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. సీఎంతోపాటు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి రాష్ట్ర సరిహద్దుల్లోని చెక్కుపోస్టులను ఎత్తివేయడం శుభపరిణామని హర్షం వ్యక్తం చేశారు.

పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలి



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు రామస్వామి

చేవెళ్ల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పేదలకు వెంటనే ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు రామస్వామి డిమాండ్ చేశారు. చేవెళ్లలో బుధవారం భూపోరాట సమితి ఆధ్వర్యంలో పేదలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేవెళ్లలోని సర్వే నంబర్ 75లో పేదలు 44 నెలలుగా గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారని, వారందరికీ ప్రభుత్వం వెంటనే ఆ స్థలంలో ఇళ్ల పట్టాలను అందజేయాలని కోరారు. ఇళ్ల పట్టాలు ఇవ్వాలని పోరాటం చేస్తున్న పేదలను ఎవరూ పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సత్యనారాయణ, మక్బుల్, మంజుల, సత్తిరెడ్డి, బాబురావు, ఎలీషా, యాదగిరి, పాపయ్య, పెంటయ్య, లలిత, భాగ్యమ్మ, వెంకటమ్మ, యాదయ్య తదితరులు ఉన్నారు.

రోడ్లపై దుకాణాల కూల్చివేత

శంకర్‌పల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రోడ్డును ఆక్రమించి వ్యాపారం చేసే వారిపై అధికారులు కొరడా ఝుళిపించారు. శంకర్‌పల్లి మున్సిపల్ అధికారులు, పోలీసు అధికారులు, ట్రాఫిక్ పోలీసులు బుధవారం సంయుక్తంగా శంకర్‌పల్లి పట్టణంలోని ప్రధానరోడ్ల వెంబడి స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. చౌరస్తాలో ప్రధాన రోడ్డును ఆక్రమించి పండ్ల వ్యాపారం నిర్వహించే దుకాణాలను తొలగించారు. బస్‌స్టాండ్‌లోకి వెళ్లకుండా ఇరువైపులా వేసిన పండ్ల దుకాణాలు, పూల దుకాణాలు, టీస్టాల్‌లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, కొబ్బరి బోండాల దుకాణాలను తొలగించారు. ఆదివారం, బుధవారం, శుక్రవారాల్లో జరిగే సంతతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు చర్యలు చేపట్టారు. కూరగాయల మార్కెట్‌కు వెళ్లే పండ్ల దుకాణాలను సైతం తొలగించాలని, నెహ్రూ మార్కెట్‌లోని స్థలంలో వ్యాపారం చేసుకోవాలని వ్యాపారులకు స్పష్టం చేశారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించేలా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ యోగేష్, మోనేజర్ అంజన్‌కుమార్, శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్, ట్రాఫిక్ సీఐ సతీశ్, ఎస్సైలు దేవేందర్, శ్రీశైలం, మంజుల, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

ఘనంగా సీతారామాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ పరిధి ఘనాపూర్‌లోని సీతారామాంజనేయస్వామి ఆలయ 15వ వార్షికోత్సవం బుధవారం జరిగింది. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్, చైర్మన్ కాంగ్రెస్ బి-బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్‌గౌడ్, ఆయన సతీమణి మాజీ సర్పంచ్ మమత పాల్గొని గణపతి హోమం నిర్వహించారు. అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకం, అర్చనలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రూప్‌సింగ్, నాయకులు సత్తయ్య గౌడ్, పరమేశ్‌గౌడ్, రాజుగౌడ్, కృష్ణగౌడ్, శంకర్‌గౌడ్, సురేష్ నాయక్, సాయిరెడ్డి పాల్గొన్నారు.



హోమం చేస్తున్న మహేశ్‌గౌడ్ దంపతులు

డబుల్ ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేదెన్నడో?

● లబ్ధిదారులకు అందించేదెప్పుడో.. ● 12ఏళ్లుగా ఎదురుచూపులు


కొడంగల్‌లో నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు


నిర్మాణంలో ఉపయోగించేందుకు తెచ్చిన సామగ్రి

కొడంగల్ రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఇల్లు లేని నిరుపేదలకు సొంతింటిని అందించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వంలో కొడంగల్ పట్టణంలోని గాంధీనగర్ పక్కనే డబుల్ బెడ్ రూమ్ నిర్మాణ పనులను ప్రారంభించారు. దాదాపు 12 సంవత్సరాలు అవుతున్నా నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. ఇళ్ల నిర్మాణం ఎప్పటికి పూర్తయి, లబ్ధిదారులకు ఎప్పుడు అందిస్తారో అని ఎదురు చూస్తున్నారు. రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల అధికారులు వీటి నిర్మాణంపై పట్టించుకోవడం లేదు. కాంట్రాక్టర్ చేసిందే పనిగా నడుస్తోంది. ఏళ్లుగా పనులను పెండింగ్‌లో పెట్టి కొద్దికొద్దిగా చేస్తుండంతో నిర్మాణంలో నాణ్యత సైతం కొరవడుతోందని లబ్ధిదారులు అంటున్నారు. ఇప్పటికైనా పూర్తి స్థాయిలో బడ్జెట్ కేటాయించి పనులు ముమ్మరం అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అధికారులు పనులు వేగవంతానికి కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తేవాలని అంటున్నారు.

తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన చంద్రశేఖర్



ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ తహసీల్దార్‌గా భీమతి చంద్రశేఖర్ బుధవారం బాధ్యతలు స్వీకరించాడు. కలెక్టర్ కార్యాలయంలో డి-సెక్షన్ నుంచి తహసీల్దార్‌గా బదిలీపై రాగా ఇక్కడ పనిచేసిన డీఎస్ రజిని కలెక్టరేట్‌కు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు కృషి చేస్తానని నూతన తహసీల్దార్ తెలిపారు.

రేంజ్ సెక్షన్ ఆఫీసర్‌గా శంకర్ ..



తాండూరు రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): తాండూరు అటవీ రేంజ్ సెక్షన్ ఆఫీసర్‌గా కె.శంకర్ రేంజ్ కార్యాలయంలో బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన రవి రిటైర్ కావడంతో కొన్ని రోజులు పెద్దేముల్ సెక్షన్ ఆఫీసర్ స్వప్న ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టారు. రేంజర్ శ్రీదేవి సరస్వతి ఆధ్వర్యంలో రెగ్యులర్ అధికారిగా హైదరాబాద్ నుంచి వచ్చిన శంకర్ బాధ్యతలు చేపట్టారు.

నాపరాయి గని కార్మికుల పంచాయితీ

బషీరాబాద్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నాపరాళ్ల తవ్వకాల విషయంలో కార్మికులు గొడవకు దిగారు. తమ తవ్వకాలను అడ్డుకుంటున్నారని తవ్వకాలు జరుపుతున్న వారిపై మండిపడి లారీని కొందరు పోలీసులకు పట్టించారు. ఈ సంఘటన ఎక్మాయిలో బుధవారం జరిగింది. అనుమతులు లేకుండా ఒకరిద్దరు తవ్వకాలు జరుపుతుండగా, మేం కూడా నాపరాయి తవ్వుకుంటామని స్థానిక కార్మికులు ప్రయత్నించారు. దీంతో రెండు వర్గాల మధ్య గొడవ జరిగింది. వారిలో కొందరు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ ఆదేశానుసారం ఆర్ఐ సుధ సిబ్బందితో గనుల వద్దకు చేరుకున్నారు. అక్కడ ఎవరికీ నాపరాళ్ల తవ్వకాలకు అనుమతులు లేవని ఆర్ఐ తేల్చి చెప్పారు.

రేగడిమైలారం వాసికి మెడిసిన్ సీటు


సుష్మిత, ఆమె తల్లిదండ్రులను సన్మానిస్తున్న నాయకులు

బొంరాస్‌పేట్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి):మండలంలోని రేగడిమైలారానికి చెందిన దాసరి చంద్రప్ప కుమార్తె దాసరి సుష్మిత ఎంబీబీఎస్‌లో సీటు సాధించింది. నీట్ ఫలితాల్లో 385 మార్కులతో నారాయణపేట్‌లోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు సాధించింది. కాంగ్రెస్ మండల నాయకులు రాంచంద్రారెడ్డి, నర్సిములునాయుడు, మల్లికార్జున్, కాశప్ప, మల్లికార్జున్, ప్రవీణ్, వెంకట్‌రెడ్డి, అంబేడ్కర్ యువజన సంఘం నాయకుడు శ్రీనివాస్ బుధవారం సుష్మితను శాలువాలతో సన్మానించి అభినందించారు.

గొడవపడిన వారి బైండోవర్

తాండూరు రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మల్కాపూర్‌లో ఈ నెల 19న గొడవలకు దిగిన ఐదుగురిపై విచారణ జరిపి బైండోవర్ చేసినట్లు కరన్‌కోట్ ఎస్ఐ రాథోడ్ వినోద్‌కుమార్ తెలిపారు. బుధవారం తహసీల్దార్ తారాసింగ్ వద్ద హాజరుపరిచారు. గ్రామంలో బైక్, లారీ విషయంలో గొడవకు దిగారు. ఇరు వర్గాల ఫిర్యాదుతో విచారణ జరిపి మరిన్ని గొడవలు జరుగకుండా బైండోవర్ చేశామన్నారు.

కార్యదర్శిపై దాడి.. వ్యక్తిపై కేసు


పీఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

పెద్దేముల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): బోరు మోటారు బాగుచేయించాలని పంచాయతీ కార్యదర్శి గ్రామస్థుడు దాడిచేసిన ఘటన తట్టెపల్లిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..తట్టెపల్లిలోని భవానీ ఆలయం వద్ద బోరు పనిచేయడం లేదు. దానిని బాగుచేయించాలని లాల్‌సింగ్ అనే వ్యక్తి పంచాయతీ కార్యదర్శి గోపాల్‌ను కోరాడు. పరిశీలించి బాగుచేయిస్తానని సెక్రటరీ చెప్పాడు. ఇంకా బోరు బాగుచేయించలేదని మంగళవారం కార్యదర్శితో లాల్‌సింగ్ గొడవపడి బూతులు తిట్టి చేతిని మెలేశాడు. దీంతో పంచాయతీ కార్యదర్శి తనపై దాడిచేసిన లాల్‌సింగ్‌పై బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వేణుకుమార్ పేర్కొన్నారు.

రేపటి మహాధర్నాను విజయవంతం చేయాలి

వికారాబాద్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): 42శాతం బీసీ రిజర్వేషన్ల సాధన సమితి ఆధ్వర్యంలో ఈ నెల 24న ఇంద్ర పార్క్ వద్ద మహాధర్నా నిర్వహిస్తామని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ కమిటీ నాయకులు శ్రీనివాస్, శ్రీశైలం, రాజు, నరేష్, నవీన్, రవీందర్, వెంకటేశం తెలిపారు. జస్టిస్ ఈశ్వరయ్య(రిటైర్డ్ జడ్జి), రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు, విశారదన్, బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ కన్వీనర్ల ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్నట్టు చెప్పారు. ఈ ధర్నాకు జిల్లా నుంచి పెద్దఎత్తున బీసీలు తరలొచ్చి విజయవంతం చేయాలని కోరారు.

ప్రోత్సాహకాలపై నేడు అవగాహన

మేడ్చల్ టౌన్, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి):స్వయం ఉపాధి పథకాలపై యువకులకు గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాశ్‌రెడ్డి తెలిపారు. నేటి ఉదయం 11గంటలకు మున్సిపల్ కార్యాలయంలో సమావేశం ఉంటుందన్నారు.

శాంతిభద్రతల రక్షణలో పోలీసుల సేవలు వెలకట్టలేనివి


పరిగిలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, ఎస్పీ నారాయణరెడ్డి

పరిగి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల సేవ వెలకట్టలేనివని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పోలీస్ ఫ్లాగ్‌డే సందర్భంగా బుధవారం పరిగిలోని ఎస్ గార్డెన్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రక్తదానం చేసిన వారిని ఎమ్మెల్యే, ఎస్పీ అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పోలీస్ ఫ్లాగ్ డే అందరికీ గర్వకారణమైన దినమన్నారు.సమాజానికి రక్షణగా నిలిచి, విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన వీర పోలీసుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతీ పౌరుడి బాధ్యత అని తెలిపారు. పోలీసు శాఖ ప్రజలకు మరింత చేరువయ్యేందుకు, వారిపై ప్రజలకు విశ్వాసాన్ని పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ఎస్పీ కె.నారాయణరెడ్డి మాట్లాడుతూ.. పోలీస్ ఫ్లాగ్‌డే అనేది విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన అమర వీరుల త్యాగాలను స్మరించుకునే దినమని తెలిపారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని చెప్పారు. పోలీసులు, యువత, ఇతరులు రక్తం దానంచేయడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాములునాయక్, డీఎస్పీ శ్రీనివాస్, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐలు మోహనకృష్ణ,నాగేందర్, పరిగి, కులకచర్ల ఏఎంసీ చైర్మన్లు పరశురాంరెడ్డి, ఆంజనేయులు, నాయకులు కె.హన్మంత్, రాంచంద్రయ్య, ఐ.కృష్ణ పాల్గొన్నారు.

మక్కల కొనుగోలు కేంద్రం ప్రారంభం


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ వై.సత్యనారాయణరెడ్డి

ధారూరు, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ధారూరు పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో బుధవారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ వై.సత్యనారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన కొనుగోలు కేంద్రంలో మొక్కజొన్న సరుకును తూకం వేసి కొనుగోళ్లను ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం రైతుల లబ్ధికోసం ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. రైతుల నుంచి క్వింటాలుకు రూ.2,400 ధరకు మక్కలు కొంటామని ఖరీదు తెలిపారు. మొక్కజొన్న పంటను ఎండబెట్టి 14శాతం తేమతో, రాళ్లు, మట్టి దుమ్ము లేకుండా గింజలను శుభ్రం చేసి కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. ఈ కేంద్రంలో విక్రయించిన మొక్కజొన్న డబ్బులు నిర్ణీత కాలంలో రైతుల ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో వ్యాపారులకు, దళారులకు అమ్మి రైతులు నష్టపోకూడదని ఆయన సూచించారు. కార్యక్రమంలో వికారాబాద్ మార్క్‌ఫెడ్ డీఎం షైమీనస్, సంఘం సీఈవో కె.నర్సింహులు, డైరెక్టర్లు గోపాల్‌రెడ్డి,అబ్దుల్ కరీం, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్-గిర్మాపూర్ బస్సు సర్వీస్ పునరుద్ధరణ


మేడ్చల్-గిర్మాపూర్ ఆర్టీసీ బస్సు సర్వీస్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

మేడ్చల్ టౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నిలిపివేసిన మేడ్చల్-గిర్మాపూర్ బస్సు సర్వీసును బుధవారం అధికారులు పునరుద్ధరించారు. ఈ రెండు గ్రామాల మధ్య కొన్నేళ్లుగా బస్సు సర్వీసు నిలిపివేయడంతో గ్రామ ప్రజలు పలుమార్లు ఆర్టీసీ అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. స్థానికుల ప్రయాణ అవసరాలను దృష్టిలో పెట్టుకుని మేడ్చల్ ఆర్టీసీ డిపో మేనేజర్ సుధాకర్ బస్సు సర్వీసును తిరిగి ప్రారంభించారు. కార్యక్రమంలో గిర్మాపూర్ గ్రామస్థులు, మేడ్చల్ ఆర్టీసీ డిపో అధికారులు పాల్గొన్నారు.

‘ఢీ’సీసీ!

(ఐదోపేజీ తరువాయి)

సామాజిక వర్గాల వారీగా ఎంపిక చేసిన జాబితాలో ఆరుగురు ఉన్నట్లు ఉన్నట్లు తెలుస్తోంది. ఒక్కో సామాజిక వర్గం నుంచి ఇద్దరేసి అభ్యర్థులతో జాబితా రూపొందించినట్లు సమాచారం.

నియోజకవర్గాల వారీగా సమావేశాలు..

అధ్యక్ష పదవికి సమర్థులైన నాయకుడిని ఎంపిక చేసేందుకు అధిష్టానం నియమించిన ఏఐసీసీ పరిశీలకుడు సంజయ్ ఠాకూర్ టీపీసీసీ పరిశీలకులు బెల్లా నాయక్, కోట నీలిమాలతో కలిసి నియోజకవర్గాల వారీగా పార్టీ విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహించి ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. 18న అనంతగిరిలోని హరిత రిసార్ట్స్‌లో దరఖాస్తుదారులతో వేర్వేరుగా మాట్లాడారు. ఈ సందర్భంగా పార్టీకి ఏ విధంగా సేవ చేశారు, పార్టీ బలోపేతానికి రాబోయే రోజుల్లో ఏ విధంగా పనిచేయనున్నారనేది అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుదారులు పార్టీలో ఎప్పటి నుంచి కొనసాగుతున్నారు, పార్టీకి వారు ఏ విధంగా సేవ చేస్తున్నారు. వారి పనితీరు, నాయకత్వ లక్షణాలు, పార్టీ కేడర్‌తో ఏ విధంగా సమన్వయంతో మెలగుతారు? అనే తదితర అంశాల గురించి పరిశీలకులు కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులను, జిల్లాలోని ముఖ్య నేతలు, సాధారణ కార్యకర్తల అభిప్రాయాలను ముఖాముఖిగా అడిగి తెలుసుకున్నారు.

మొత్తం 24 మంది ఆశావహులు

కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవికి కొడంగల్ నియోజకవర్గం మినహా మిగితా మూడు నియోజకవర్గాల నుంచి ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. వికారాబాద్ నియోజకర్గం నుంచి టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల రఘువీరారెడ్డి, వికారాబాద్ పట్టణ అధ్యక్షుడు అర్ధ సుధాకర్ రెడ్డి, హెచ్‌డీసీసీబీ డైరెక్టర్ ఎన్.కిషన్ నాయక్, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్ డి.లక్ష్మణ్, మండల పార్టీ అధ్యక్షుడు బి.రాజశేఖర్‌రెడ్డి, బంట్వారం మాజీ జెడ్పీటీసీ సంతోష, పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గాండ్ల పల్లవీశివానంద్ దరఖాస్తు చేసుకన్నారు. పరిగి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి కుమారుడు డాక్టర్ రితీక్‌రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు లాల్‌కృష్ణ ప్రసాద్, డీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి హన్మంత్ ముదిరాజ్, దరఖాస్తు చేసుకున్నారు. తాండూరు నుంచి పార్టీ సీనియర్ నాయకుడు ఉత్తమ్ చంద్, మాజీ జెడ్పీటీసీ ధారాసింగ్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత, జిల్లా మహిళా కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు శోభారాణి, బషీరాబాద్ మండల పార్టీ మాజీ శంకరప్ప దరఖాస్తు చేసుకున్నారు. వీరితో పాటు మరో ఎనిమిది మంది పార్టీ నాయకులు దరఖాస్తు చేశారు.

బకాయిలు రూ.13కోట్లు

(ఐదో పేజీ తరువాయి)


తాండూరు 220కేవీ సబ్ స్టేషన్

వికారాబాద్ ప్రభుత్వ కార్యాలయాలు రూ.50లక్షల మేరకు బకాయిలు ఉన్నాయి. కాగా, జిల్లా విద్యుత్ సర్కిల్‌లో రూ.17.07 కోట్ల విద్యుత్ బిల్లు డిమాండ్ ఉంది.

సిబ్బందికి బకాయిల వసూళ్లలో టార్గెట్లు

విద్యుత్ శాఖలో సరిపడా సిబ్బంది లేని కారణంగా ఒకవైపు కోతలు లేని కరెంటును అందించడంతో పాటు మరో వైపు విద్యుత్ బకాయిల వసూళ్లపై దృష్టి సారిస్తున్నారు. దీంతో లైన్‌మెన్ నుంచి ఏడీఈ వరకు ఫీల్డ్‌లోకి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో వారిపై పనిభారం పెరిగింది. అయినా సిబ్బందికి బకాయిల వసూళ్లపై లక్ష్యాన్ని నిర్దేశించారు. ఎంత వసూలు చేస్తున్నారు రోజు వారీగా ఎక్కడ ఫీల్డ్‌లోకి వెళ్తున్నారనే విషయాన్ని సాసా యాప్‌లో పొందుపర్చాల్సి ఉంటుంది. స్వయంగా సాసా యాప్‌ను సీఎండీ పరివేక్షిస్తుండటంతో బకాయిల వసూళ్లకు సిబ్బంది రంగంలో దిగడం అనివార్యమైంది. ప్రతీ మండలానికో సబ్ ఇంజనీర్ ఉండాల్సి ఉండగా ఐదు సెక్షన్‌లకు కలిపి ఒక్కరే ఉన్నారు. ఆ ఒక్క సబ్ ఇంజనీర్ ఏడీఈ పరిధిలో పని చేస్తున్నారు. పెద్దేముల్ ఏఈకి అదనంగా యాలాల మండలం ఏఈగా బాధ్యతలు అప్పగించగా తాండూరు మండలానికి ఇన్‌చార్జి ఏఈని, బషీరాబాద్ మండలనికి సబ్ ఇంజనీర్‌గా ఇచార్జిగా బాధ్యతలు అప్పగించారు. తాండూరు పట్టణంలో 35వేల సర్వీస్‌లు ఉండగా ఒకే ఒక్క ఏఈ మాత్రమే ఉండటం గమనార్హం.

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలి మృతి

పెద్దేముల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు మృతిచెందిన సంఘటన గాజీపూర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గాజీపూర్‌నకు చెందిన దౌల్తాబాద్ చంద్రమ్మ(73) పక్షవాతంతో ఇంటివద్దే ఉండేది. ఆమె కోడలు వ్యవసాయ కూలికి పోయింది. ఆమె కొడుకు రాములు గ్రామంలో ఓ వ్యక్తి అంత్యక్రియలకు వెళ్లాడు. ఇంట్లో చంద్రమ్మ ఒక్కతే ఉంది. మంగళవారం సాయంత్రం చంద్రమ్మ గాయాలతో పండి ఉండగా గ్రామస్థులు నర్సమ్మకు ఫోన్‌చేసి చెప్పారు. దీంతో ఆమె భర్తకు ఫోన్‌చేసి చెప్పగా రాములు ఇంటికి చేరుకున్నాడు. చంద్రమ్మ తలకు చిన్న గాయమైందని అలాగే ఊరుకున్నారు. అదే రోజు రాత్రి చంద్రమ్మ అపస్మారక స్థితిలో చేరడంతో 108లో తాండూరు జిల్లాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ చంద్రమ్మ బుధవారం మృతిచెందింది. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ వేణుకుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బంగారం కోసమే గాయపర్చారా?

గ్రామస్థులు చెబుతున్న వివరాల ప్రకారం చంద్రమ్మ మెడలో తులం బంగారు గుండ్లు ఉన్నాయి. వాటిపై కన్నేసిన దుండగుడు చంద్రమ్మ తలపై కొట్టి గుండ్లు ఎత్తుకపోయాడని అంటున్నారు. బంగారు గుండ్లు పోయినట్టు కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొనలేదని పోలీసులు పేర్కొంటున్నారు. మరి చంద్రమ్మ ఎలా చనిపోయిందనే విషయమై పోలీసులు పూర్తిస్థాయి విచారణ చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు


బైక్ ఢీకొని గాయపడిన కార్తీక్

చౌడాపూర్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలో బుధవారం చోటు చేసుకుంది. మందిపాల్ గ్రామానికి చెందిన కార్తీక్ బైక్‌పై చౌడాపూర్ నుంచి మరికల్‌కు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొన్నాయి.దీంతో కార్తీక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం కులకచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్‌కు తీసుకెళ్లాలని వైద్యులు సూచించగా కుటుంబ సభ్యులు మహబూబ్‌నగర్‌కు తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కాగా ఇదే ప్రమాదంలో బంగారంపల్లి పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్, కారోబార్ లింగమయ్యలకు గాయాలయ్యాయి.

ఆటో ఢీకొని మరొకరికి ..


గాయపడిన నెహ్రూనాయక్

బొంరాస్‌పేట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన బొంరాస్‌పేట్ మండలంలో చోటు చేసుకుంది. దుద్యాల్ మండలం చెట్లుపల్లి తండాకు చెందిన నెహ్రూనాయక్ బుధవారం బైక్‌పై కొడంగల్‌కు వెళ్తున్నాడు. లింగంపల్లి గేటు సమీపంలో కొడంగల్ నుంచి వస్తున్న ఆటో ఢీకొట్టింది. ప్రమాదంలో నెహ్రూనాయక్ కాలు విరిగింది. స్థానికులు అతడిని కొడంగల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య


శ్రీకాంత్ (ఫైల్)

మర్పల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రైలుకింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మర్పల్లిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు మర్పల్లికి చెందిన పొట్టి శ్రీకాంత్(28) ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలతో సతమతం అవుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం శ్రీకాంత్ తెల్లవారుజామున రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల సీజ్



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

యాలాల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేశామని యాలాల ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బుధవారం కోకట్ వాగు నుంచి ఇసుక తరలిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు వెళ్లి చూడగా కోకట్‌కు చెందిన రెండు ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్నారు. పోలీసులు ట్రాక్టర్ డ్రైవర్లు వెంకటప్ప, సూరప్పలను అనుమతి పత్రాలు కోరగా ఎలాంటి పత్రాలు లేవన్నారు. దీంతో ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

పాంబండపై కార్తీక పూజలు ప్రారంభం

కులకచర్ల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): బండవెల్కిచర్ల పాంబండపై కార్తీక మాస పూజలు ప్రారంభమయ్యాయి. నవంబరు 20 వరకు కార్తీక పూజలు కొనసాగుతాయని ఆలయ చైర్మన్ షైపాల్‌రెడ్డి, ఈవో బాలనర్సయ్య బుధవారం పేర్కొన్నారు. ఈ నెల 31న సత్యనారాయణ స్వామి వ్రతాలు, నవంబరు 5న పౌర్ణమి సందర్భంగా రుద్రహోమం, గిరి ప్రదక్షిణ, రాత్రి దీపోత్సవం, 17న లక్ష బిల్వార్చన, 18న స్వామివారి కల్యాణోత్సవం, 20న తైలాభిషేకం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.